క్లుప్తంగా

నేడు ఎన్‌పీఆర్‌డీ జిల్లా విస్తృత సమావేశం

ఏలూరు (టూటౌన్): వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఏలూరు జిల్లా విస్తృత సమావేశం శనివారం ఉదయం స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్టు సంఘం గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య తెలిపారు. విభిన్నప్రతిభావంతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరారు. విభిన్న ప్రతిభావంతులు హక్కుల చట్టం 2016 పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఈ మేరకు ప్రత్యేక పోలీస్ స్టేషన్లు, కోర్టులు ఏర్పాటు చేయాలని, వికలాంగుల పింఛన్ నెలకు రూ.6 వేలు ఇవ్వాలని, వికలాంగుల జీవనోపాధికి సబ్సిడీతో కూడిన వడ్డీలేని బ్యాంకు రుణం రూ.5 లక్షలు ఇవ్వాలని, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు కాకుండా రెగ్యులర్ ఉద్యోగాలు కూడా ఇవ్వాలని, ఉద్యోగాలు ఇచ్చేవరకూ నిరుద్యోగ భృతి రూ.10 వేలు అందించాలనే తదితర డిమాండ్లపై చర్చిస్తారని పేర్కొన్నారు.

కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఆర్ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమా ల్లో ప్రదర్శనలు ఇచ్చే కళాకారులు దేవస్థానంలో దరఖాస్తు సమర్పించాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు పేర్కొన్నారు. గత గురువారం సప్తాహాల నిర్వహణకు సంబంధించి ట్రస్ట్‌బోర్డు సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఉత్సవాలను ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 17 వరకు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏటా భక్తుల కోసం ఏర్పాటు చేసే సాంస్కృతిక ప్రదర్శనలు ఈ ఏడాదీ కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న కళాకారులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను దేవస్థానం కార్యాలయంలో సమర్పించాలని, ఇతర వివరాలకు సెల్ నెంబర్ 99899 61085లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నికలు


శ్రీనివాసరావు

ఏలూరు (ఆర్ఆర్ పేట): ఆర్యవైశ్యులకు సేవా కార్యక్రమాలు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య మహాసభ అనుబంధ సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష పదవికి త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల పర్యవేక్షకుడు గాదంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సంఘం అధ్యక్ష స్థానానికి ఈ నెల 14న ఉదయం 10 గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్లు దాఖలు చేసే వారు ఏలూరులోని రోబో రెస్టారెంట్‌లో తమను సంప్రదించవచ్చన్నారు. 16వ తేదీన నిమినేషన్ల స్క్రూటినీ నిర్వహించి, నికర జాబితాను అదే రోజు ప్రకటిస్తామని తెలిపారు.

పేదల పెన్నిధి సీఎం వైఎస్ జగన్

- ఏలూరులో వై ఏపీ నీడ్స్ జగన్
- వైఎస్సార్ సీపీ క్లస్టర్–1 అధ్యక్షుడు చంద్రశేఖర్


12వ డివిజన్‌లో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ క్లస్టర్-1 అధ్యక్షులు చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ సదానందం


గన్‌బజార్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న క్లస్టర్-3 మహిళా అధ్యక్షురాలు స్రవంతి, ఎస్సీ విభాగం అధ్యక్షుడు దాసు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ఆదుకుంటున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ అన్నారు. ఏలూరు వన్‌టౌన్ 51వ సచివాలయం పరిధిలో 12వ డివిజన్ కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అనంతరం 56వ డివిజన్‌లోనూ రాష్ట్రానికి సీఎం జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాల్లోనూ తొలుత వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వం పేదవర్గాలకు అందిస్తోన్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాల సంక్షేమ బోర్డును జేసీఎస్ క్లస్టర్–1 కన్వీనర్ మోటమర్రి సదానందకుమార్, మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి ప్రారంభించారు. ఈ రెండు సచివాలయాల పరిధిలో సుమారుగా రూ.40 కోట్ల సంక్షేమ పథకాలను అందజేసినట్టు చెప్పారు. లబ్ధిదారులు సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల పెన్నిధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని వివరించారు. గతంలో చంద్రబాబు పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. సామాన్యుడికి కూడు, గూడు, వైద్యం అందించేందుకు సీఎం జగన్ చేస్తోన్న మహాయజ్ఞంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని హయాంలో 30 వేలకు పైగా పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. ఏలూరులో జగనన్న కాలనీల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. నగరం అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరారు. చంద్రబాబు హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో ఘోరంగా మోసం చేశారని విమర్శించారు. ఏలూరులో వేలాది మంది పేదలకు ఇళ్లు కట్టేందుకు ఎమ్మెల్యే నాని ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమాల్లో సచివాలయ కన్వీనర్లు నాని, బండ్లమూడి సునీల్, ఉపాధ్యక్షులు రాధ, మంగమ్మ, విజయ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

టూటౌన్‌లో..

22వ సచివాలయం పరిధిలో 44వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పొలిమేర దాసు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పార్టీ క్లస్టర్–3 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి హాజరయ్యారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో పురోభివృద్ధి సాధించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యాన్ని ఇస్తున్నారని వివరించారు.

ఓటు హక్కు సాధించుకోవాలి


15వ డివిజన్‌లో సమావేశం నిర్వహిస్తున్న కార్పొరేటర్ రాము

ఏలూరు రూరల్: సుస్థిర, సంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొనేందుకు ప్రతి ఒక్కరూ ఓటు ఉపయోగించుకోవాలని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక 15వ డివిజన్ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీలోపు అర్హతున్న ప్రతి ఒక్కరూ ఓటు సాధించుకోవాలన్నారు. ఇందుకోసం బీఎల్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కృషి చేయాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనలు పాటించి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు పొందేలా సహకరించాలని అన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటు మూలాధారమని గుర్తు చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన ప్రభుత్వాలు ఏర్పడాలంటే ఓటు ఎంతో కీలకమని యువత గుర్తించాలని సూచించారు.

ఏలూరులో అభివృద్ధి మార్గాలు


మరడాని రంగారావు కాలనీలో చేపట్టిన ప్రధాన రహదారి నిర్మాణ పనులు

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రూపొందించారు. ఎమ్మెల్యే నాని నగరంలోని ప్రతి గడపకూ పాదయాత్రగా వెళ్లి వారి సమస్యలను స్వయంగా తెలుసుకుంటున్నారు. ఒకవైపు సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తూనే, మరోవైపు నగరంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు 13వ డివిజన్‌లో అనేక సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మరడాని రంగారావు కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని రూ.40 లక్షలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. 13వ డివిజన్ కార్పొరేటర్ నిడికొండ అన్నపూర్ణ, పార్టీ యువజన అధ్యక్షుడు నిడికొండ నరేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు పనులను ప్రారంభించారు. ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యకు పరిష్కారం చూపటం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం


ర్యాలీలో పాల్గొన్న కొవ్వలి వినియోగదారుల సేవా మండలి ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశంలో అమలవుతున్న వినియోగదారుల చట్టంపై విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొవ్వలి వినియోగదారుల సేవా మండలి అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ పిలుపునిచ్చారు. కొవ్వలి వినియోగదారుల సేవా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఈదర సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాల, శనివారపు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, వినియోగదారుల చట్టం–2019పై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారుల వ్యవహారాలపై అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో జాతీయ స్థాయిలో అన్ని విద్యా సంస్థల్లో వినియోగదారుల క్లబ్‌లను ఒక టీచర్ గైడ్‌గా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతి విద్యార్థీ తెలివైన కొనుగోలుదారుగా వ్యవహరించాలని, వస్తువు మన్నిక గురించి, కొన్న వస్తువు ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై పూర్తిగా తెలుసుకోవాలని, ప్యాకింగ్ అందానికంటే వస్తువు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ బ్యాగ్‌లను తిరస్కరించాలని, గ్యాస్, విద్యుత్, నీరు వంటి సహజ వనరులను పొదుపుగా వాడుకోవాలని వివరించారు. సీనియర్ న్యాయవాది సీఏపీఎస్ రామానుజాచార్యులు మాట్లాడుతూ వినియోగదారునిగా నష్టపోతే వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు చేస్తే వస్తువు ధరలు తిరిగిపొందవచ్చని అన్నారు. కొన్న వస్తువులకు తగిన రసీదు పొందాలని, నిత్య జీవితంలో ప్రతి వ్యక్తీ వినియోగదారునిగా మార్కెట్ మాయాజాలంలో పడకుండా వస్తువులు జాగ్రత్తగా ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి స్థాపనకు కృషి చేద్దాం


దివ్య బలిపూజ సమర్పిస్తున్న ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి క్రైస్తవుడూ అమలోద్భవి మాత విశ్వాస పంథాలో నడవాలని, సమాజంలో శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏలూరు కథోలిక పీఠం బిషప్ పొలిమేర జయరావు పిలుపునిచ్చారు. స్థానిక అశోక్ నగర్‌లోని అమలోద్భవి మాత విచారణలో ఈ నెల 6 నుంచి ప్రారంభమైన అమలోద్భవి విచారణ 13వ వార్షికోత్సవ కార్యక్రమాల ముగింపు వేడుకల్లో శుక్రవారం రాత్రి బిషప్ జయరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమలోద్భవి మాత అడుగుజాడల్లో నడవడం ద్వారా నిరుద్యోగ సమస్యలు, సాంఘిక సమస్యల నుంచి దూరమై, అన్ని వ్యసనాల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఏసుక్రీస్తు ప్రబోధాలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచిస్తూ దివ్యబలి పూజ నిర్వహించారు. ఉత్సవాలను ఏలూరు పీఠం వికార్ జనరల్ పి.బాల పతాకావిష్కరణ చేసి భక్తులకు దివ్య సందేశం అందజేశారు. ఉత్సవాల రెండో రోజు గురుత్వ సిల్వర్ జూబ్లీ జరుపుకుంటున్న దెందులూరు విచారణ కర్త ఫాదర్ జి.అమ్మన్న రాజా, చింతలపూడి విచారణ కర్త ఫాదర్ కె.బల్తజార్, బొర్రపాలెం విచారణకర్త ఫాదర్ బి.విజయ ప్రసాద్, గొల్లవాని తిప్ప విచారణ కర్త ఫాదర్ ఎ.జోసఫ్ రాజ్ తమ 25 ఏళ్ల ప్రభు సేవ ప్రయాణాన్ని విశ్వాసులకు వివరించారు. అమలోద్భవి విచారణ గురువు ఫాదర్ ఇంజే పాల్ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు త్రిదిన ప్రార్థనలు – ఆధ్యాత్మిక ఆయుత్త దినాలు నిర్వహించామని చెప్పారు. తమ విచారణ ద్వారా ఇటీవల అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అమలోద్భవి విద్యా సంస్థల్లో చదువుతున్న 150 మంది విద్యార్థులకు నూతన దుస్తులతో పాటు విద్యా విషయక వస్తువులు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా అమలోద్భవి విద్యా సంస్థల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశ్వాసులను అలరించాయి.

విద్యుత్ ఎస్‌ఈ సాల్మన్‌రాజు సేవలు అభినందనీయం


ఎస్‌ఈ సాల్మన్‌రాజును అభినందిస్తున్న సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తుపాను ప్రభావంతో జిల్లాలో ఏర్పడిన విద్యుత్ సమస్యలను అతితక్కువ సమయంలో సమర్థవంతంగా పరిష్కరించడంలో ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్‌ఈ సాల్మన్‌రాజు చూపిన చొరవ అభినందనీయమని విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం డిస్కం కార్యదర్శి తురగా రామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో సాల్మన్‌రాజును సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాపై తుఫాను ప్రభావం పడుతుందని వాతావరణ శాఖ హెచ్చరించిన వెంటనే సాల్మన్‌రాజు స్పందించి తమ సిబ్బందిని, అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు వినియోగదారులకు కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించి, తుఫాను ప్రభావం తగ్గేటట్టు చర్యలు తీసుకున్నారని కొనియాడారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, పరివర్తకాలు సిద్ధంగా ఉంచి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ఎస్‌ఈ విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఎస్‌ఈని అభినందించిన వారిలో విద్యుత్ ఓసీ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.గోపాల కృష్ణ, ఎం నిరంజన్, డిస్కం వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వీరభద్రరావు, ట్రెజరర్ సీహెచ్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో విశేష పూజలు


పవరుపేట విశ్వేశ్వరస్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పలు శైవక్షేత్రాల్లో చిత్తా నక్షత్రం పర్వదినం సందర్భంగా విశేష పూజలు చేశారు. పత్తేబాద శ్రీ చౌడేశ్వరీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకారం చేశారు. సాయంత్రం చౌడేశ్వరి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఆలయ అర్చకులు కొడమంచిలి లక్ష్మణరావు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పవర్‌పేటలో..

కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం గణపతి పూజ, మహన్యాస పారాయణ చేశారు. మహారుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం లక్ష బిల్వార్చన, అనంతరం అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన చేశారు. రాత్రి మేళతాళాలతో స్వామి వారికి విశేష ధూప సేవ, విశేష హారతి సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి రామబ్రహ్మానంద శర్మ ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.15	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4822	30
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	31
ఏలూరు –తిరుపతి	16.00	4830	23

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	50	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07–10
బెండకాయలు	48	కంద	60
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	44
కాకర కాయలు	40	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	60	అల్లం	120
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	44	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	50–55	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	32	బఠాణి	--
ఆనపకాయ (1)	20–25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	34

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ఏలూరు (టూటౌన్): తుపాను నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. తుపాను వల్ల రైతులకు జరిగిన నష్టాలపై శుక్రవారం స్థానిక అన్నే భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి, పొగాకు, అరటి, కూరగాయలు, మిర్చి, మినుము తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్టు చెప్పారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.25 వేలు వాణిజ్య పంటలు ఎకరాకు రూ.50 వేలు పరిహారం చెల్లించాలని కోరారు. తడిచిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

11 నుంచి 'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్'

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 11 నుంచి 16 వరకు అఖిలభారత సాంకేతిక విద్యా మండలి సహకారంతో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ (అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. దేశంలోని వివిధ కళాశాలల నుంచి 50 మంది అధ్యాపకులు పాల్గొంటారని, ఈ కార్యక్రమం వల్ల ఉపాధ్యాయుల్లో సృజనాత్మకత, విషయం, జ్ఞానం పెరుగుతుందని కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు పేర్కొన్నారు. దేశంలోని పేరెన్నికగన్న విద్యా సంస్థల నుంచి అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు పాల్గొని శిక్షణ ఇస్తారని, ఇటువంటి కార్యక్రమానికి తమ కళాశాలను ఎంపిక చేయడం తమకు గర్వకారణమని కళాశాల ఇన్‌చార్జి కార్యదర్శి కిలారు ప్రభాకరరావు తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడ రిజిస్ట్రార్ ఎల్ సుమలత ముఖ్య అతిథిగా పాల్గొంటారని, తమ కళాశాల ప్రొఫెసర్ ఆదిమూలం యేసుబాబు సమన్వయకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు.

10న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ

ఏలూరు(మెట్రో): విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో ఈ నెల 10న నిర్వహించే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ కె.రమేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఏలూరు రెవెన్యూ భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కనీస వేతనం రూ.26000, ఉద్యోగులందరికీ కార్పొరేట్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో దిగువ స్థాయిలో ఉన్న క్లాస్–4 ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వమూ అందించే సంక్షేమ పథకాలను అందేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ ఔట్‌సోర్సింగ్ జిల్లా చైర్మన్ కె.నాగభూషణం, జనరల్ సెక్రటరీ భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ ఎం.హైమవతి, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీ కుమారి, స్టేట్ ప్రెసిడెంట్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ దుర్గ, సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐటీయూసీ మహాసభ

ఏలూరు (టూటౌన్): ఏలూరులో ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించే ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆ సంఘం ఏలూరు ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణమాచార్యులు, ఎ.అప్పలరాజు తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. 9న ఉదయం 10 గంటలకు ఆర్ఆర్‌పేట సర్వీస్ రిజర్వాయర్–2 నుంచి ఉద్యోగ, కార్మిక ప్రదర్శన, 11 గంటలకు స్థానిక స్ఫూర్తి భవన్ వద్ద ప్రతినిధుల సభ ఉంటుందని పేర్కొన్నారు. ఏర్పాట్లను ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పుప్పాల కన్నబాబు, రెడ్డి శ్రీనివాస డాంగే పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.

మొరాయించిన ఎర్ర కాలువ గేటు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం గేట్లను దింపుతుండగా నాలుగు గేట్లలో ఒక గేటు మొరాయించింది. ఇరిగేషన్ అధికారులు గేట్‌ను కిందికి దింపే చర్యలు చేపట్టారు. ఎర్రకాలువ జలాశయంలోకి శుక్రవారం ఇన్‌ఫ్లో తగ్గడంతో గేట్లను మూసివేసే చర్యల్లో ఈ పరిస్థితి ఏర్పడింది. గేటుకు తుక్కు, కర్ర దుంగలు అడ్డుతగలడంతో గేటు మొరాయించినట్టు ఇరిగేషన్ శాఖ ఏఈ భాస్కరరావు తెలిపారు. జలాశయం వరద ఇన్‌ఫ్లో తగ్గిందని, జలాశయం పూర్తి నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.98 నీటి మట్టం ఉందని చెప్పారు.